క్లుప్తంగా

స్వామిదాసుకు వైఎస్సార్ సీపీ శ్రేణుల ఘన స్వాగతం



తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు 45 రోజుల అమెరికా పర్యటన ముగించుకుని ఆదివారం ఉదయం తిరువూరు చేరుకున్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలువురు నాయకులు స్వామిదాసు, ఆయన సతీమణి సుధారాణికి ఘన స్వాగతం పలికారు. తిరువూరులోని ఆయన స్వగృహంలో జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు మూడు దుర్గారావు, మోదుగు ప్రసాద్, పార్టీ నాయకులు రేగళ్ల మోహన్‌రెడ్డి, తాళ్లూరి నవీన్‌కుమార్, ముక్కామల సీతారామయ్య, చలమాల సత్యనారాయణ, భూక్యా రాము తదితరులు స్వామిదాసును మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల పరిణామాలను వివరించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం రాత్రి రాష్ట్ర సృజనాత్మక, భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు కళాకారులు సంగీత, నాట్య ప్రదర్శనలిచ్చారు. జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి పులిపాటి నరసింహారావు పర్యవేక్షించారు.

ఘనంగా యోగి వేమన జయంతి



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో ఆదివారం యోగి వేమన జయంతి నిర్వహించారు. వేమన శతకాలతో సామాజిక చైతన్యం కల్పించిన వైనాన్ని గ్రంథాలయాధికారి శ్రీలత వివరించారు. సరళమైన, వాడుక భాష పదాలు ఉపయోగించి రాసిన పద్యాలు సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ఉన్నాయని, విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో అనేక పద్యాలు రాసి చాందస భావాలకు తొలి అడ్డుకట్ట వేసిన సంఘ సంస్కర్త వేమన అని వక్తలు కొనియాడారు.

డైరీ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ ఎ–445 డైరీ, క్యాలెండర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆమె నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ యూనియన్ నేతలు ఎన్టీటీపీఎస్ యాజమాన్యానికి, కార్మికులకు మధ్య వారధిలా ఉండాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. సంస్థ యాజమాన్యం, విద్యుత్ శాఖ మంత్రితో చర్చించి కాంటాక్ట్ కార్మికులకు రావలసిన ఎరియర్స్, ఉద్యోగుల డీఏ ఇప్పించాలని ఎంపీ పురందేశ్వరిని నాయకులు కోరారు. కూటమి నాయకుడు నూతులపాటి బాలకోటేశ్వరరావు, పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, బొర్రా ప్రవీణ్, వీఆర్దీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నూజివీడు: పట్టణంలోని బోర్వంచ రోడ్డు మార్జిన్‌లో పెద్ద గొయ్యి పడి ప్రమాదకరంగా మారింది. నాలుగు నెలల కిందట కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరద ఉధృతికి బోర్వంచ రోడ్డులో మలుపు సమీపంలో భారీ గుంత పడింది. దీనిని పూడ్చించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. గంత వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు 'కూటమి' షాక్

- వ్యవసాయ విద్యుత్ 9 నుంచి 7 గంటలకు కుదింపు
- పొట్టదశలో ఉన్న మొక్కజొన్న
- తగినంత సాగునీరు లేకపోతే దిగుబడులు తగ్గిపోతాయని రైతుల ఆందోళన

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే పగటిపూట 9 గంటల వ్యవసాయ విద్యుత్‌ను సరఫరా చేయడంలో చేతులెత్తేశాయి. గత పది రోజులుగా 7 గంటలు మాత్రమే విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులను కూటమి ప్రభుత్వం నిండా ముంచుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ప్రతి రోజూ పగటిపూటే 9 గంటల పాటు వ్యవసాయానికి విద్యుత్‌ను సరఫరా చేశారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ సరఫరా గంటలను తగ్గించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రబీలో తాము సాగు చేసిన పంటల పరిస్థితి ఏమిటని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ముసునూరు మండలం చిల్లబోయినపల్లి సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు.

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో రైతులు మొక్కజొన్నను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. పంటలన్నింటికీ బోరుబావులే ఆధారం. కమర్షియల్‌తో పాటు విత్తన మొక్కజొన్నను సైతం రైతులు సాగు చేశారు. రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట ప్రస్తుతం 40 రోజుల నుంచి 60 రోజుల దశలో ఉంది. అధిక శాతం పొట్టదశలో ఉండి కంకి పాలు పోసుకుంటోంది. ఈ దశలో వ్యవసాయ విద్యుత్‌ను తగ్గించడం వల్ల సాగు చేసిన పంటలకు సాగునీరు సరిపడా అందక ఎండిపోతున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

నియోజకవర్గంలో 29,269 వ్యవసాయ కనెక్షన్లు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి 29,269 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా, 13,300 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. వీటితో పాటు రైతులు కూరగాయల పంటలను, పుచ్చ తదితర వాటిని సాగు చేశారు. అలాగే ఆయిల్‌పామ్ తోటలు అధిక విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ పంటలన్నింటికీ సాగునీరు ఎంతో అవసరం.

నూజివీడు నియోజకవర్గంలో సాగు చేసిన మొక్కజొన్న, వ్యవసాయ కనెక్షన్ల వివరాలు

మండలం	మొక్కజొన్న సాగు (ఎకరాల్లో)	వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
నూజివీడు	1,400	8,040
ఆగిరిపల్లి	500	5,335
ముసునూరు	2,700	6,440
చాట్రాయి	8,700	9,454
మొత్తం	13,300	29,269



జంగంగూడెంలో సాగునీరు సరిపోకపోవడంతో ఎండుతున్న మొక్కజొన్న పంట



పొట్టదశలో ఉన్న మొక్కజొన్న పంట



తుక్కులూరులో సాగునీరు సరిపడా అందక ఎండుతన్న పామాయిల్ మొక్క

మొక్కజొన్న, కూరగాయలు, పుచ్చ, ఆయిల్‌పామ్ పంటలకు నీళ్ల ఏమాత్రం తగ్గినా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

సాగునీరు అందడం గగనమే..

మూడు నెలలుగా వర్షాలు లేకపోవడంతో భూగర్భ జల మట్టం పడిపోయింది. దీంతో రెండున్నర అంగుళాలు పూర్తిగా నీళ్ల వచ్చే బోర్లు అంగుళంన్నరకు పడిపోయాయి. ఇప్పుడు వ్యవసాయ విద్యుత్ సరఫరాను 9 నుంచి 7 గంటలకు తగ్గించడంతో రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు అందడం గగనంగా మారింది. గతంలో ఎకరంన్నర వరకు తడిచేదని, ఇప్పుడు అరెకరం తడవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇచ్చే ఏడు గంటల సమయంలో కూడా ఫీజు పోయిందని, జంపర్ కట్ అయిందని, విజయవాడలో ఫాల్టు వచ్చిందని పలు మార్లు కరెంటును నిలిపివేస్తున్నారని, దీంతో నికరంగా ఇచ్చేది 6 గంటలు మాత్రమేనని రైతులు పేర్కొంటున్నారు. ఇచ్చే విద్యుత్‌ను నిరంతరాయంగా ఇవ్వకుండా పలుమార్లు నిలిపివేసి ఇస్తుండటంతో తడిసిందే తడుస్తోందని వాపోతున్నారు.

అరెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా



ఎకరానికి రూ.30 వేలు కౌలు చెల్లించి ఆరు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న మొక్కజొన్నకు సాగునీరు ఎంతో అవసరం. ప్రభుత్వం ఒక్కసారిగా ఏడు గంటలకు విద్యుత్ సరఫరాను తగ్గించేసింది. మధ్యమధ్యలో కరెంటు సరఫరాలో అంతరాయం నెలకొనడంతో నికరంగా ఆరు గంటలే వస్తోంది. నీళ్ల అందక దిగుబడి పడిపోయి నష్టాల పాలయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం 9 గంటల పాటు వ్యవసాయ విద్యుత్‌ను సరఫరా చేయాలి.

– తల్లిబోయిన రాజగోపాలస్వామి, మర్రికుంట, నూజివీడు మండలం

సాగునీరు లేకుంటే నష్టాలే



13 ఎకరాల్లో పుచ్చతోట సాగు చేశా. తొమ్మిది గంటలు విద్యుత్‌ను సరఫరా చేసినప్పుడు రెండు బోర్లతో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో బొటాబొటిగా సాగునీరు సరిపోయేవి. ఇప్పుడు ఏడు గంటలకు తగ్గించడం, తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో ఆరు ఎకరాలు కూడా తడవడం లేదు. ఇప్పటి వరకు ఎకరాకు లక్ష రూపాయల పెట్టుబడి అయింది. పంట పిందె పడుతున్న దశలో ఉంది. సాగునీరు లేకపోతే దిగుబడి పడిపోయి నష్టాలలో కూరుకుపోతాం.

– మూల్పూరి విజయ్‌కుమార్, తుక్కులూరు, నూజివీడు మండలం

వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రతాప్ అప్పారావు పరామర్శ



వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం పరామర్శించారు. శోభనాపురం వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కనబోయిన సాంబశివరావు తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో సాంబశివరావును ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. నూగొండపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు కందుల శ్రీనివాసరావు తల్లి మృతి చెందడంతో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, సర్పంచ్ కందుల విక్రమ్, నక్కనబోయిన శ్రీమన్నారాయణ, దాసరి రామారావు, వాక సక్కేశ్వర్‌రావు, హనుమంతరావు, బెజవాడ శ్రీహర్ష పాల్గొన్నారు.

పాలడుగు సేవలు ఆదర్శం



ముసునూరు: ధైర్య సాహసాలు, ఉక్కు సంకల్పంతో జమిందారీ వ్యవస్థను ఎదుర్కొని పేద ప్రజల కోసం భూ పోరాటాలు చేసిన పాలడుగు ధైర్య సాహసాలు మనకు ఆదర్శమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వలసపల్లి రామచంద్ర ప్రసాద్ (రాముడు) అన్నారు. మాజీ మంత్రి పాలడుగు వెంకటరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని గుళ్లపూడిలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాముడు మాట్లాడుతూ పాలడుగు సేవలను కొనియాడారు. ఉప సర్పంచ్ వేంపాటి వల్లీ పద్మజ రాంబాబు, మాజీ సర్పంచ్ ఊరకరణం వల్లీ శాంతకుమారి, సీనియర్ నేతలు ఐలూరి కామేశ్వరరావు కూరపాటి శోభనాద్రి, వేంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిట్టడవిలా 'సాగర్' మేజర్లు

- ఆక్రమణకు గురైన మైనర్లు
- పూడుకుపోయిన కాలువలు
- నీరు పారని పరిస్థితిపై రైతుల ఆందోళన

తిరువూరు: మెట్ట పొలాలకు సాగునీరందించే నాగార్జున సాగర్ ఎడమ కాలువలు కనీస నిర్వహణ లేక రూపురేఖలు మారిపోతున్నాయి. తిరువూరు మండలంలోని రెండు మేజరు కాలువల పరిధిలో వెయ్యి ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు పారే పరిస్థితి లేకుండా పోయింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తుమ్మలపల్లి వద్ద ప్రారంభమయ్యే తిరువూరు మేజరు కాలువ 16 కిలోమీటర్ల పొడవునా చిట్టడవిని తలపిస్తోంది. కాలువలో నీరుపారే వీలులేకపోవడంతో దాళ్వా సాగు ప్రశ్నార్థకంగా మారింది. తిరువూరు పట్టణ పరిధిలో ఈ కాలువలోకి డ్రెయినేజీ నుంచి వచ్చే మురుగునీరు వదలడం, చెత్తాచెదారం, మాంసఖండాలు, వ్యర్థాలు పారబోస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. పలు మైనర్ కాలువలు ఆక్రమణకు గురవడంతో చెరువుల్లోకి నీరు చేరే పరిస్థితి కనిపించడం లేదు.

తూతూమంత్రంగా ఉపాధి పనులు

ఖమ్మం జిల్లా కొండిగట్ల వద్ద ప్రారంభమయ్యే కాకర్ల మేజరు 17 కిలోమీటర్ల నిడివి ఉండగా చాలావరకు పూడికతో నిండిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఉపాధి హామీ పథకం నిధులతో కాకర్ల మేజరు కాలువ కట్టలపై జంగిల్ క్లియరెన్స్ చేయడానికి అనుమతి ఇచ్చినప్పటికీ పనులు తూతూమంత్రంగా జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. తిరువూరు మండలంలోని 10 గ్రామాలకు తిరువూరు, కాకర్ల మేజర్ల ద్వారా సాగర్ జలాలు అందాల్సి ఉన్నందున నాగార్జున సాగర్ ప్రాజెక్టు అధికారులు వెంటనే ఈ కాలువల మరమ్మతు పనులు జరిపించి నీరు పారే వీలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న తిరువూరు మేజర్ కాలువ



అధ్వానంగా కాకర్ల మేజర్ కాలువ

ప్రతిపాదనలు పంపాం

సాగర్ మేజరు కాలువల మరమ్మతుకు, జంగిల్ క్లియరెన్స్‌కు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు చేపడతాం. కాకర్ల మేజరుపై ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులతో ప్రయోజనం చేకూరుతుంది.

– సునీత, ఎన్ఎస్పీ తిరువూరు సెక్షన్ ఏఈ

అమిత్ షా రాకను వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన ప్రదర్శన

మైలవరం: కేంద్రమంత్రి అమిత్‌షా రాకను వ్యతిరేకిస్తూ మైలవరం పంచాయతీ కార్యాలయం కూడలిలో సీపీఎం నాయకులు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీపీఎం మైలవరం మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండించని తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకుల తీరు భారత రాజ్యాంగాన్ని అగౌరవ పరిచేలా ఉందని అన్నారు. దేశ ప్రజలు బీజేపీ ప్రభుత్వ నిరంకుశ రాజ్యాంగ వ్యతిరేక పాలనను, వారి విధానాలను వ్యతిరేకించాలని కోరారు. అమిత్ షా వంటి రాజ్యాంగ ఉల్లంఘనకారులు, మత విద్వేషాలు రెచ్చగొట్టేవారు అధికారంలో ఉండటం దేశ భవిష్యత్‌కు ప్రమాదకరమన్నారు. తక్షణమే పార్లమెంట్‌లో అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, రావూరి రమేష్, సందిపాం ఇస్సాక్, రావుల సుబ్బారావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు మారేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

● **మైలవరం:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాకు ఎన్టీఆర్ జిల్లాలో నిరసన సెగలు చుట్టుముడుతున్నాయి. గత పార్లమెంట్ సమావేశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ జి.కొండూరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నినాదాలు చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరైన నేపథ్యంలో జి.కొండూరులోని సినిమాహాల్ రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాలు నిరసన చేపట్టాయి. సీపీఎం సీనియర్ నాయకుడు పంది సాంబశివరావు, గ్రామ కార్యదర్శి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ డైరెక్టర్ బట్టపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

● **ముసునూరు:** ముసునూరు మండపం సెంటర్‌లో జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రాజు ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. రాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో రాజ్యాంగ నిర్మాతకే గౌరవం లేకుండా పార్లమెంట్ స్థాయిలో అవమానించడం ఘోరమన్నారు. వ్యాఖ్యలను వెనక్కు తీసుకోకుండా కేంద్రమంత్రి రాష్ట్రాల్లో పర్యటించడం భారత దేశానికే అవమానకరమన్నారు. మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు, నేతలు పిల్లి మురళి, గంగుల సత్యం, కంచర్ల రమేష్, పోతురాజు, దుర్గారావు, రంగారావు, కుటుంబరావు పాల్గొన్నారు.

● **నూజివీడు:** అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి నండూరి రామహనుమాన్లు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత పట్ల ఎగతాళిగా మాట్లాడిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా నాయకులు జి.రాజు, రామకూరి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో అమిత్‌షా గో బ్యాక్ అంటూ నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు



నూజివీడులో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

మాదిగ ఉత్సవ్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ముసునూరు: మాదిగలు ఐక్యతతో మాదిగ ఉత్సవ్–2025ను విజయవంతం చేయాలని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కాట్రేనిపాడు–చిల్లబోయినపల్లి సరిహద్దు మాదిగ కొండ ప్రాంతంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు గురిందపల్లి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న మాదిగ ఉత్సవ్–2025 వాల్ పోస్టర్లను మంత్రి ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల ఆచార, సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు చాటే విధంగా మాదిగ కొండ వద్ద ప్రతి ఏటా నిర్వహిస్తున్న మాదిగ ఉత్సవ్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నూజివీడు, ఏలూరు, విజయవాడ, గుంటూరు తదితర నగరాలకు చెందిన మాదిగ ప్రముఖులు హాజరవుతారని చిట్టిబాబు చెప్పారు.

విజేతలకు బహుమతుల అందజేత

మైలవరం: మన్నె జయకుమార్, సుకుమార్‌ల జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా యువకులకు, మహిళలకు నిర్వహించిన షటిల్, క్యారమ్స్, టెన్నికాయిట్, కబడ్డీ పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళల విభాగంలో కబడ్డీలో ప్రథమ బహుమతి అశ్విని, రత్న టీమ్, ద్వితీయ బహుమతి విజయలక్ష్మి, స్వప్న టీమ్, టెన్నికాయిట్‌లో ప్రథమ బహుమతి అశ్విని, నిరీష టీమ్, ద్వితీయ బహుమతి అపర్ణ, జ్యోతి టీమ్, పురుషుల విభాగంలో షటిల్ ప్రథమ బహుమతి చాట్ల అశోక్, వీరయ్య టీమ్, ద్వితీయ బహుమతి బండపల్లి ప్రేమ్‌కుమార్, రాకేష్ టీమ్, క్యారమ్స్‌లో ప్రథమ బహుమతి చాట్ల సువర్ణరావు, అశోక్ టీమ్, ద్వితీయ బహుమతి మల్లాది శ్రీను, వీరాస్వామి టీమ్ గెలుపొందాయి. విజేతలకు మన్నే శాంతికుమార్, చాట్ల ఆదియ్య, మన్నె బూషిమ్మ బహుమతులు అందజేశారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో తమ సమస్యలపై డివిజన్‌లోని ప్రజలు అర్జీలను అందజేయవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరిస్తామన్నారు.

కనుల పండువగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

నూజివీడు: త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు పట్టణంలోని అమర్ భవన్‌లో ఆదివారం కనుల పండువగా సాగాయి. శ్రీ సత్య కూచిపూడి, జానపద నృత్య అకాడమీ ఆధ్వర్యంలో, నూజివీడు కళావేదిక సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభమైన నాద సంగీత నాట్య నివేదన కార్యక్రమాలు రాత్రి తొమ్మిది గంటల వరకు సాగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పలు సంగీత, నాట్య నివేదన కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీగణేశుడి ప్రార్థనతో ప్రారంభమైన అనంతరం పలువురు కళాకారులు ఆలపించిన త్యాగరాజ పంచరత్న కృతులు ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశాయి. ప్రముఖ సంగీత దర్శకులు వాసు ప్రదర్శించిన త్యాగరాజ గీతాల విభావరి విశేషంగా ఆకట్టుకుంది. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ మృదంగ విద్వాంసులు దండమూడి సుమతి రామ్మోహన్, ప్రఖ్యాత నృత్య దర్శకులు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ కేవీ సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భామా కలాపం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీసత్య కూచిపూడి, జానపద నృత్య కళాశాల చైర్మన్ వేంపాటి మోహన్ పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐడీ డీఎస్పీ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల అనంతరం త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నూతన కార్యవర్గం ఎంపిక

తిరువూరు: తిరువూరు రచయితల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మాజీ సర్పంచి ఉయ్యూరు అనసూయ నివాసంలో జరిగిన సంఘ సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా పసుపులేటి వెంకయ్య, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఉయ్యూరు అనసూయ, రేపాక రఘునందన్, ఉపాధ్యక్షులుగా విశ్వనాథుని శంకరాచారి, కార్యదర్శిగా ఈడే వెంకట భరతకుమారి, సహాయ కార్యదర్శిగా వజ్రాల ఇందిర, కోశాధికారిగా కోదాటి రజని ఎన్నికయ్యారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

చాట్రాయి: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాడి రైతులకు ఆదివారం బోనస్ పంపిణీ చేశారు. మండలంలోని చీపురుగూడెం గ్రామ పాల ఉత్పత్తిదారులకు 2023–24 సంవత్సరానికిగానూ రూ 2.40 లక్షల బోనస్‌ను అందజేశారు. తిరువూరు పాల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

నూజివీడు: డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి ఈ నెల పదో తేదీన ప్రకటన జారీ చేశామని, దరఖాస్తు స్వీకరణకు తుది గడువును ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పొడిగించామని నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కానీ సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయాల్లో కానీ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.